ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: టెంపుల్ అల్వాల్ మహాలక్ష్మి దేవాలయం ఐదవ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం సుప్రభాతసేవ, మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకరణ, శ్రీలక్ష్మీ మూలమంత్రహోమం, మహాపూర్ణాహుతి, సంప్రోక్షణ అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆక్స్‌ఫర్డ్ 26వ ఫ్యామిలీ డే

అల్వాల్: అల్వాల్ మంగాపురం కాలనీలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ 26వ ఫ్యామిలీ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెయిన్‌బో ఆసుపత్రి డాక్టర్ రూపాకుచనా, సన్నీకుమార్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, రీజనల్ ఇన్‌చార్జి ఆరోగ్యరెడ్డి, అల్వాల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి, ముంతాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దాస కవితకు డాక్టరేట్



ఉప్పల్: మహబూబాబాద్ జిల్లా హరిపిరాల గ్రామానికి చెందిన దాస కవిత తొర్రూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి, ఉన్నత విద్య ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి ప్రభుత్వం ఉద్యోగం సాధించడంతో పాటు పట్టుదలతో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) స్కీమ్ ఇన్ తెలంగాణ స్టేట్ ఆఫ్ సెలెక్టెడ్ డిస్ట్రిక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.రాములు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ధాత్రిరత్న సేవా పురస్కారం

కుషాయిగూడ: మహిళా దినోత్సవం సందర్భంగా చర్లపల్లి డివిజన్‌కు చెందిన సామాజిక కార్యకర్త, బీజేపీ నాయకురాలు చంద్రకళ ధాత్రిరత్న పురస్కారాన్ని అందుకున్నారు. ఆమెకు సెవెన్ ఫండమెంటల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత మాట్లాడుతూ.. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానన్నారు.

దోమల నియంత్రణ చర్యలు

కాప్రా: దోమల నిర్మూలన చర్యలను కాప్రా జీహెచ్‌ఎంసీ ముమ్మరం చేసింది. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మస్కిటో లార్వా వృద్ధి చెందకుండా డ్రోన్ల సాయంతో ఎంటమాలజీ సిబ్బంది దొమల మందు పిచికారి చేశారు. కాప్రా డివిజన్‌లో నూతనంగా తీసుకొచ్చిన ఈ డ్రోన్‌ను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ ప్రారంభించారు. అనంతరం సాకేత్ కాలనీ పార్క్ రెసిడెన్సీ, గోకుల్ రెసిడెన్సీ ప్రాంతాల్లో ఎంటమాలజీ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కాలువలు, చెరువులు సిబ్బంది వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వదిలారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

మల్లాపూర్: దోమల నివారణకు నాచారం పటేల్ కుంటచెరువులో డ్రోన్ యంత్రం సాయంతో రసాయనాలను పిచికారి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ మాట్లాడుతూ.. చెరువులో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించాలని అధికారులను కోరారు. ఎంటమాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజర్ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నారీమణులు.. అభివృద్ధికి సారథులు

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు సాధించిన విజయాలు ● కొందరు స్ఫూర్తిని నింపుతూ.. మరికొందరు అండగా నిలుస్తూ..



మహిళాదినోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే.అరుణ, మహిళా నేతలు



ఈసీఐఎల్‌లో మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళా ఉద్యోగులు

సీనియర్ మహిళా క్రికెట్ పోటీల్లో స్థానం సాధించడమే లక్ష్యం..



ఏ రంగంలోనైనా రాణించాలంటే కేవలం ఆసక్తి ఉంటే సరిపోదు. ఎన్నోసార్లు ఓటమి ఎదురైన ధైర్యంగా సంకల్ప బలంతో ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు. భవిష్యత్తులో భారత్ సీనియర్ మహిళా క్రికెట్ టీమ్‌లో స్థానం సంపాదించుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను.

– ద్రితి కేసరి, క్రికెటర్ (అండర్–19)

సేవాభావంతో నిర్వహిస్తున్నాం..



సాధన దివ్యాంగుల పాఠశాలలో మానసిక వికలాంగ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పాఠశాలను నడిపిస్తున్నాం. 2005లో అమెరికా తెలుగు అసోసియేషన్, 2020లో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అవార్డుతో పాటు 2024లో సంకల్ప సేవా పురస్కారం లభించడం గర్వంగా ఉంది.

– సురేఖారెడ్డి, సాధన మానసిక దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకులు



మహాభోది విద్యాలయలో..

ఆకాశం, అవనిలో సగమైన మహిళ నేడు సాంకేతిక, విద్య, వైద్య, విజ్ఞానం, రాజకీయం తదితర రంగాల్లో పైచేయి సాధించారనడంలో అతిశయోక్తి లేదు. సమాజంలో ముందుండి 'ఆడదంటే అబల కాదు సబల' అని నేటి మహిళ లోకం నిరూపించింది. ఈ నేపథ్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒడిదుడుకులను ఎదుర్కొని సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచి యువతులకు.. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం.

పురుషులకు మించి శక్తియుక్తులు చాటుతున్నారు..



మహిళలు పురుషులకు మించి తమ శక్తి, యుక్తులు చాటుతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ప్రతీ రంగంలో పురుషులకు దీటుగా మహిళలు పోటీపడుతున్నారు. ఇంట్లో అందరి ఆరోగ్యంపై దృష్టిపెట్టే మహిళ తన ఆరోగ్యంపై మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. ఆమె ఆరోగ్యంగా ఉంటేనే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటుంది.

– డాక్టర్ రమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి

మహిళల్లో చైతన్యం నింపాలి



మహిళల భద్రత, ఉపాధిపై ప్రభుత్వాలు చొరవచూపాలి. గత 15 ఏళ్లుగా ఎన్జీవో, ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలకు అనేక ఉపాధి, ఉద్యోగ మార్గాలను చూపుతూ మహిళా సాధికారత దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ పథకాల్లో మహిళలను భాగస్వాములను చేసేందుకు కార్యచరణ చేపడుతున్నాం.

– ధేరం ఉష, అభయ వ్యవస్థాపకురాలు

కుట్టుశిక్షణతో ఆర్థికంగా ఎదగాలి



మహిళలు స్వయం సంమృద్ధి సాధించడానికి కుట్టుశిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణతో నేర్చుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఎక్స్‌ట్రా మైల్ అనే స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో సూర్యనగర్ ఇంటిలోనే దాదాపు 50 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను ఇచ్చి కుట్టు మిషన్లను అందజేస్తున్నాం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నారు.

– చేగూరి సరిత, మల్లాపూర్, సూర్యనగర్

పేద మహిళలకు చేయూత



పేద, మధ్యతరగతి మహిళలకు చేయూతనిచ్చేందుకు ఉచితంగా కుట్టుమిషన్ నేర్పిస్తున్నాను. వారు తమ కాళ్లపై తాము నిలబడేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. సమాజ సేవకోసం ఉద్యోగానికి రాజీనామా చేసి ట్రస్ట్ ఏర్పాటుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

– రేణుకారవికుమార్, సీఆర్ఆర్‌సిటీ చైర్మన్

జనఔషధి దినోత్సవం



కార్యక్రమంలో మట్లాడుతున్న డాక్టర్ జయశీల



జనఔషధి వారోత్సవాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం భవానీనగర్ పల్లె దవాఖానాలో శుక్రవారం ప్రధానమంత్రి పిలుపు మేరకు జనఔషధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశిల, ఆశవరర్స్ భాగలక్ష్మీ,అనిత, భవానీనగర్ కాలనీ అధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, మల్కా ప్రకాష్, వీర ప్రతాప్ రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అమరేందర్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, కృష్ణారెడ్డి, వినోద తదితరులు పాల్గొన్నారు.

జమ్మిగడ్డ పీహెచ్‌సీలో..

కాప్రా: జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జన్‌ఔషధీవారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని కుషాయిగూడ పీహెచ్‌సీలో జన్‌ఔషధి వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు జనరిక్‌మెడికల్ షాపుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిపై ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రమాదేవి, విజయారాణి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నేతలు లక్ష్మీనారాయణపటేల్, కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్ బస్తీ దవాఖానాలో..

కాప్రా: జన్‌ఔషధి వారోత్సవాలు కాప్రా డివిజన్ నేతాజీనగర్ బస్తీ దవాఖానాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ.. పేదల ప్రజల కోసం తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందించేందుకు జన్ ఔషధి కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. గర్భిణులు, డయాబెటిక్ పేషెంట్స్, కేన్సర్, గుండెపోటు తదితర 105 రుగ్మతులకు జన్‌ఔషధీ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్, బీజేపీ నేతలు శాంతికిరణ్, మహేందర్‌రెడ్డి, బాల్‌చందర్, డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనరిక్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

కుషాయిగూడ: జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన పెంచే దిశగా వైద్యారోగ్యశాఖ సిబ్బంది కృషి చేయాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో శుక్రవారం జన ఔషధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. తక్కువ ధరలకై మార్కెట్‌లో లభ్యమవుతున్న జనరిక్ మందులపై ప్రజల్లో అనేక సందేహాలు, అపోహలున్నాయన్నారు. దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే జనరిక్ మందుల వినియోగం పెరుగుతుందన్నారు. ఆ దిశగ కృషిచేసి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. డాక్టర్ పల్లవి, ఏఎన్ఎం నాగుబాయి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్కాజిగిరి: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సత్యరాఘవేంద్రకాలనీలో సుమారు రూ.49 లక్షలతో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో బండచెరువు క్రింద ఉన్న కాలనీలు వర్షం పడినప్పుడు ముంపునకు గురయ్యేవని, ఈ సమస్య పరిష్కారానికి బాక్స్‌డ్రైన్ల నిర్మాణం చేపట్టామని దాదాపుగా ముంపు సమస్య పరిష్కారమైందన్నారు. ప్రతి వేసవిలోనే డీస్టింగ్ పనులు చేపట్టాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా 11కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీరారెడ్డినగర్, కౌండిన్యనగర్, అంబేడ్కర్‌నగర్, వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్డు, రవీంద్రనగర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మల్టీ స్టీల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు నాచారం పారిశ్రామిక వాడలోని రోడ్డు నెంబర్ 07,08లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ దుర్గానగర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్ 18, 11కేవీ టెక్‌పార్క్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సైనిక్‌పురి, విజయపురి కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ 11కేవీ ఏఆర్‌కే హోమ్స్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, అల్వాల్ సబ్‌స్టేషన్ 11కేవీ భూపతిరావునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11.30 వరకు, హెచ్‌ఎంటీ ఆఫీసర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హెచ్‌ఎంటీ, పంచశీల్‌కాలనీ, భూదేవినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ లక్ష్మీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుభాష్‌నగర్, ప్రభుత్వ పాఠశాల, ఆర్టీసీకాలనీ, టీచర్స్‌కాలనీ, గన్‌రాక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉప్పల్: హబ్సిగూడ 11కేవీ రవీందర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా స్ట్రీట్‌నెంబర్ 8లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. జేఎస్ఎన్‌కాలనీ, జోషెఫ్‌లైన్ రవీందర్ నగర్ లైన్ 1 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఐజసిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు, పీఅండ్‌టీ కాలనీ, ఎస్సీకాలనీ, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, 11 కేవీ గ్రీన్ హిల్స్ కాలనీఫీడర్ పరిధిలో 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీవీనగర్, వసంతవిహార్ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బోడుప్పల్: దేవేందర్‌నగర్ ఫీడర్ మెయిన్‌టెన్స్ పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలుకాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్ కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, గౌతమీనగర్, రాజీవ్‌నగర్, అన్నపూర్ణకాలనీ, వీరారెడ్డికాలనీ, ఇందిరానగర్, జ్యోతినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సాయిభవానీనగర్, గాయత్రీహిల్స్, మల్లయ్యనగర్, వాసవీనగర్, తిరుమల మెడోస్, హేమనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరస్వతినగర్, శ్రీనగర్, విజయపురికాలనీ, శ్రీలక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంతనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. రాఘవేంద్రకాలనీ, సాయిమారుతీనగర్, కేశవనగర్, బృందావన్ కాలనీ, ద్వారకానగర్ ఫేస్ 1,2, ఆంజనేయనగర్, గాయత్రినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి , కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్యనగర్‌కాలనీలో రూ.15లక్షలతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పనులను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో అవసరమైన చోట డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, సీసీరోడ్లు తదితర పనులను చేపడుతున్నామని తెలిపారు. జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సిరాజుద్దిన్, స్థానిక కాలనీవాసులు పద్మారెడ్డి, యాదగిరిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ముత్యాలు, అంజయ్య, సోమిరెడ్డి, దశరథ్, రవీందర్, బీఆర్ఎస్ నేతలు తండా వాసుగౌడ్, పీఆర్, ప్రవీణ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో కార్పొరేటర్ రజితారెడ్డి

రామంతాపూర్: ఉప్పల్ నల్లచెరువు 2007లో పూర్వం నుంచి తాగునీటితో నిండి ప్రజలకు తాగు, సాగునీరు అందించేది. ప్రస్తుతం చెరువు కాలుష్య కాసారంగా మారి, కబ్జాలకు గురైందని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నల్లచెరువును పరిరక్షించాలని శుక్రవారం ఆమె హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వివరించారు. దీనిపై ఘట్‌కేసర్, ఉప్పల్ అధికారుల సమన్వయలోపంతోనే కబ్జాలు అధికమయ్యాయని ఆమె కమిషనర్‌కు వివరించారు. ప్రస్తుతం రెవెన్యూ ఇతర విభాగాల వద్ద తప్పుడు మ్యాప్‌లు ఉన్నాయని, 2011కు ముందు మ్యాప్‌లను పరిగణలోకి తీసుకోవాలని ఆమె రంగనాథ్‌ను కోరారు. చెరువు వెలుపల ఉన్న హద్దులను గుర్తించి చెరువు పరిరక్షణకు కంచె ఏర్పాటు చేయాలని విన్నవించారు.

భారత్‌లో పోషక అవసరాలను పెంచాలి

ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్.బి.బర్బుద్దే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ బర్బుద్దే

బోడుప్పల్: మాంస ప్రియులకు సురక్షితమైన, రుచికరమైన పోషకాలతో కూడిన చికెన్ అందించడానికి మధూస్ హెర్బల్ చికెన్ వారు కృషి చేస్తున్నారని ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్.బి. బర్బుద్దే అన్నారు. చెంగిచర్లలోని (ఐసీఏఆర్) నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం మధూస్ హెర్బల్ చికెన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆకలి సూచికలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉండటం, భారత జనాభా పోషక అవసరాలను పెంచాల్సిన అవసరాన్ని సూచిస్తుందన్నారు. మాంసంతో పాటు జంతుఆధారిత ఆహారాలు ప్రొటీన్, విటమిన్, ఖనిజ అవసరాలను తీర్చడంలో సహాయ పడుతుందన్నారు. మధూస్ హెర్బల్ ఫార్మ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, పి.వీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ఫౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్ హైదరాబాద్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, మధూస్ హెర్బల్ చికెన్ సీఈఓ రాంప్రసాద్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక సేవతోనే ఆనందం

రామంతాపూర్ : రామంతాపూర్ గోకుల్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ మంగళ తాను స్థాపించిన హృదయ భారతి స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్రంలో ఎవరూ పట్టించుకోని దూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను జీర్ణోద్ధరణ చేపడుతూ కుంభమేళా, సమ్మక్క సారక్క వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సాధవులు, యాత్రికులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పవిత్ర సంకల్పానికి ప్రకృతి, పరమేశ్వరుడు సదా సహకరిస్తాడని, భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మౌలాలి: డివిజన్ పరిధిలోని విష్ణుశ్వరకాలనీలో రూ.28 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. కాలనీ అధ్యక్షుడు వెంకటేష్‌తోపాటు బాలరాజు, సత్యనారాయణగౌడ్, బళ్లారి వెంకటేష్, వేణుగోపాల్, భగవంత్‌రెడ్డి, సందీప్‌గౌడ్, పులి వేణు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు



చక్రిపురం చౌరస్తా వద్ద సంబరాల్లో బీజేపీ నేతలు

కుషాయిగూడ: టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో శుక్రవారం బీజేపీ చర్లపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. చక్రిపురం చౌరస్తాలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు నాదం, లక్ష్మణ్‌గౌడ్, ఇస్లావత్ హరినాయక్, బ్రహ్మచారి, సహదేవ్‌గౌడ్, విద్యాసాగర్, దయానంద్, శ్రీనివాస్, అప్పినాయి, వెంకటేష్, శ్రీకాంత్, కృష్ణ, బిక్షపతి, రాము, మహిళా మోర్చా అధ్యక్షురాలు చంద్రకళ, కళావతి తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న విశాంత్ర కలెక్టర్ లక్ష్మీకాంత్

మల్లాపూర్: మహిళలు వివక్షతకు గురవుతున్నామనే అపోహలను వీడి అన్ని రంగాల్లో రాణించాలని కృష్ణాజిల్లా విశాంత్ర కలెక్టర్ శ్రీలక్ష్మీకాంత్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నాచారం సాధన మానసిక దివ్యాంగుల సంస్థలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మహిళలు, ఆర్థిక, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని, తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియడారు. అనంతరం సాధన సంస్థ వ్యవస్థాపకులు సురేఖారెడ్డితో పాటు ఉద్యోగులు, ఆశావర్కర్లు ఘనంగా సత్కరించారు. ఏసుబాబు, ఏవీ, రమణమూర్తి, ఉదయ్‌భాస్కర్, ప్రభావతి, లక్ష్మీనాయుడు తదితరులున్నారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలి

మల్కాజిగిరి: ఆశావర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లా రాయికల్‌లో విధులు పూర్తిచేసుకుని వెళ్తున్న ఆశావర్కర్‌పై లైంగికదాడికి పాల్పడి పదిరోజులైనా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని, ఆశావర్కర్ల సంక్షేమం, భద్రతకోసం ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలన్నారు. ఎం.క్రిష్ణమ్మ, చిట్టిబాయి తదితరులు పాల్గొన్నారు.